క్లుప్తంగా

వలలో చిక్కుకున్న తాచుపాము



వలలో చిక్కుకున్న భారీ తాచుపాము

అల్లవరం: ఓడలరేవు పంచాయతీ పరిధిలోని మరిడమ్మ సెంటర్‌లో చిలకలపూడి రాజా ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన వలలో భారీ తాచుపాము చిక్కుకుంది. వల నుంచి బయట పడే మార్గం లేక ఇబ్బంది పడుతున్న పాముని స్థానికులు గుర్తించి స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇచ్చారు. వర్మ ఘటనా స్థలానికి చేరుకుని వలలో చిక్కుకున్న పాముని కాపాడి సురక్షిత ప్రాంతంలో వదిలారు. సుమారు ఏడు అడుగుల పొడవున్న పాముని స్థానికులు ఆసక్తిగా చూశారు.

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

అమలాపురం రూరల్: భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ టి.నాగలక్ష్మి అన్నారు. ఆదివారం కోనసీమ జిల్లా కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికులు యూనియన్ నాయకులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పనిచేసే ప్రతి కార్మికుడు భవన నిర్మాణ కార్మికులుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా గతంలో కార్మికులుగా నమోదు చేయించుకున్నవారు రెన్యువల్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లాలో భవన నిర్మాణ రంగ సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

డిపాజిట్లపై అధిక వడ్డీ ఇచ్చేది డీసీసీబీ



ఉప్పలగుప్తంలో అవగాహన ర్యాలీ నిర్వహస్తున్న సహకార బ్యాంకు సిబ్బంది

ఉప్పలగుప్తం: డిపాజిట్లపై అత్యధిక వడ్డీ ఇచ్చే బ్యాంకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబి) అని నోడల్ ఆఫీసర్ కేఎస్‌వీఎస్ఎన్ మూర్తి అన్నారు. ఉప్పలగుప్తం డీసీసీబి బ్రాంచ్ మేనేజర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం డిపాజిట్ల సేకరణ మహోత్సవం ర్యాలీని స్థానిక గ్రామంలో నిర్వహించారు. రైతులు, షాపుల యజమానులు, గ్రామ పెద్దలను కలిసి డిపాజిట్లపై బ్యాంకు ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో బ్రాంచ్ సూపర్‌వైజర్ ఎం.నరేష్, బ్రాంచ్ సిబ్బంది, సహకార సొసైటీల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌సీఎం చర్చి ఫాదర్‌కు డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌ను అందుకుంటున్న మరియదాసు

యానాం: యానాం పట్టణ రోమన్ కేథలిక్ చర్చి ఫాదర్ పొలమరిశెట్టి మరియదాసుకు ఆంధ్రా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయన 'విపత్తుల నిర్వహణ, ప్రాణ-ఆస్తి నష్ట నివారణకు తోడ్పడిన అంశాలు' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగం అధిపతి ఎ.నరసింహరావు చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను అభినందించారు.

జేసీకి వినతి పత్రం



జేసీ నిషాంతికి వినతి పత్రం అందిస్తున్న కోనసీమ డీలర్ల సంఘం నాయకులు


అమలాపురం రూరల్: ప్రభుత్వం కొత్త చేపట్టిన రేషన్ షాపుల విలీనంలో భాగంగా ఒకే గ్రామంలో 850 రేషన్ కార్డులున్న షాప్‌లోని కార్డులను తక్కువగా కార్డులున్న షాప్‌లకు కలపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతిని కోనసీమ డీలర్ల సంఘం ప్రతినిధులు కోరారు. ఆదివారం కలెక్టరేట్‌లో జేసీ నిషాంతిని రేషన్ డీలర్ల సంఘం నాయకులు అడపా వెంకటరమణ, నడింపల్లి అన్నపూర్ణ, అరిగెల సుబ్రహ్మణ్యం కలిసి రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

పాతదే ముద్దంట.. కొత్తది వద్దంట..

- అమలాపురంలో రెండో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం
- రూ.కోటి ఖర్చుతో నిర్మించినా నిరుపయోగంగా భవనం
- ప్రజలకు అందుబాటులోకి తేకుండా నిర్లక్ష్యం



నిర్మాణం పూర్తయినా నిరుపయోగంగా మిగిలిన రెండో అర్బన్ హెల్త్ సెంటరు భవనం



పగిలిపోయిన అర్బన్ హెల్త్ సెంటరు భవనం కిటికీలు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం జిల్లా కేంద్రంగా మారాక స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వ హయాంలో రెండో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. స్థానిక 27వ వార్డు మున్సిపల్ కాలనీలో రూ.కోటి వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఎనిమిది నెలల క్రితమే దాన్ని ప్రారంభించారు. అయితే అక్కడ బాత్రూమ్‌లు, మరుగుదొడ్లకు నీటి సౌకర్యం లేదని అర్బన్ హెల్త్ సెంటరు సేవలను మొదలు పెట్టలేదు. దీంతో ఇప్పటికీ కుళాయి చెరువు వద్ద కచేరి చావిడి భవనంలో అరకొర వసతులతో రెండో అర్బన్ హెల్త్ సెంటర్ నడుస్తోంది. అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగు నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వ నేతలు మాత్రం కొత్త భవనాన్ని అందుబాటులో తీసుకురాకుండా పాతదే ముద్దని, కొత్తది వద్దని అంటున్నారంటూ మున్సిపాలిటీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

భవనం శిథిలం చేసేస్తారా..?

అమలాపురం పట్టణంలో సుమారు 53,000 మంది నివసిస్తున్నారు. పట్టణ ప్రజల కోసం పెరుగుతున్న అవసరాల దృష్ట్యా పెద్దాసుపత్రి ఒక్కటే సరిపోదని పరాయి పంచన ఉన్న రెండో అర్బన్ హెల్త్ సెంటర్‌ను సొంత భవనంలోకి తెచ్చి ప్రజలకు పూర్తి అందుబాటులో తీసుకురావాలని గత ప్రభుత్వం అధునాతన హంగులతో ఈ భవనాన్ని నిర్మించింది. అయితే రూ.కోటి వ్యయంతో భవనాన్ని నిర్మించినా ఉపయోగించకపోవడం, దాని నిర్వహణ సైతం ఎవరూ పట్టించుకోకపోవడంతో భవనం క్రమేణా దుమ్ము పట్టిపోతోంది. ఇప్పటికే భవనానికి చుట్టూ ఉన్న కిటికీల అద్దాలన్నీ పగిలిపోయాయి. పేద ప్రజలకు ఎంతో ఉపయోగకారిగా ఉండే ఈ హెల్త్ సెంటర్‌కు నూతన భవనం సమకూరిందన్న సంతోషాన్ని కూడా పట్టణ ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇవ్వలేకపోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అవుతున్నా ఈ ఆరోగ్య కేంద్రం నూతన భవనం అందుబాటులోకి తీసుకురావాలన్న దిశగా ఆలోచన చేయకపోవడంపై పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు. కేవలం మరుగుదొడ్లకు నీటి సదుపాయం కల్పిస్తే సరిపోతుందన్న విషయం తెలిసినా కూటమి ప్రభుత్వం ఆ ప్రయత్నాలు చేయడం లేదు. ఇటీవల ఈ భవనాన్ని జిల్లా సీపీఎం నాయకులు సందర్శించి భవన దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేశారు. నూతన భవనాన్ని ఇలాగే వదిలేసి శిథిలం చేసేస్తారా అంటూ ప్రశ్నించారు. తక్షణమే భవనానికి మరమ్మతులు చేపట్టి ప్రజల వైద్య అవసరాల కోసం అందుబాటులో తీసుకురావాలని డిమాండ్ చేశారు.

అందుబాటులోకి తీసుకురావాలి



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పట్టణ రెండో అర్బన్ సెంటర్‌కు సొంత భవనాన్ని నిర్మించారు. మరుగుదొడ్లకు నీటి సదుపాయం వంటి చిన్న చిన్న పనులే పెండింగ్ ఉన్నాయి. ఆయా పనులకు తక్షణమే టెండర్లు పిలిచి ఆరోగ్య కేంద్ర భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– బండారు గోవిందు, 27వ వార్డు కౌన్సిలర్, అమలాపురం

పనులు చేయడానికి ముందుకు రాకే

ఇప్పటికే పూర్తయిన అర్బన్ హెల్త్ సెంటరు భవనానికి రూ.20 లక్షల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని గతంలోనే కాంట్రాక్ట్ ఇద్దామని ప్రయత్నించినా ఎవరూ పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో కొంత జాప్యం జరిగింది. ఈ పనులకు టెండర్లు పిలిచి పనులు చేపట్టి త్వరలోనే భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.

– సీహెచ్ నాగ సతీష్, డీఈఈ, అమలాపురం మున్సిపాలిటీ

రఘురామకృష్ణంరాజు దిష్టి బొమ్మ దహనం



వన్నెచింతలపూడిలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న దళిత నాయకులు



గోపవరంలో రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు కార్యకర్తలు

అమలాపురం రూరల్: ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం క్షమించరాని నేరమని, ఆయనపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మండలంలోని వన్నె చింతలపూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం రఘురామకృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పరమట మోహన్‌కుమార్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు పరమట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కుంచే సదాశివుడు, సెక్రటరీ కందేరి వెంకటరమణ, జాయింట్ సెక్రటరీ పరమట భీమమహేష్ తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

ముమ్మిడివరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేసి దళిత జాతిని అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని రిపబ్లికన్ పార్టీ సీనియర్ నాయకుడు మట్టా వెంటరావు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కులో ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు దుశ్చర్యను ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ జిల్లా ఉపాధ్యక్షుడు చీకురుమిల్లి శ్రీనివాస్, దోనిపాటి ఆంజనేయులు, ముంగండ ఆశీర్వాదం, పంతగడ నరసింహమూర్తి, తరపట్ల వెంకటేశ్వరరావు, సఖిలే సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రఘురామకృష్ణం రాజుపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం రూరల్: ఉండి నియోజకవర్గం ఏలూరుపాడు గ్రామంలో ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం దళితులను కించపరచడమేనని ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బత్తుల నకుల రాజు, గోసంగి బంగార్రాజు పేర్కొన్నారు. ఆదివారం బుద్ధ విహార్‌లో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ దళిత సామాజిక వర్గ ఓట్లతో గెలిచిన కృష్ణంరాజు దళితుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదన్నారు. కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై కాకినాడ ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నేరేడుమిల్లి సత్యనారాయణ, గెద్దం ప్రదీప్, మంగం సుధాకర్, ప్రసాద్, గోసంగి ఆనందరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనం

ఉప్పలగుప్తం: ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని చింపేయడం దారుణమంటూ మండలంలోని గోపవరం గ్రామంలో మాలమహానాడు కార్యకర్తలు ఆదివారం నిరసన చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు దళిత నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దుర్మార్గమైన ఘటనలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కుంచే బాబులు, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, అయితాబత్తుల బుజ్జిదొర, గెద్దం శ్రీను, దాకారపు పండు, కుంచే కిట్టు, కాకర దుర్గాప్రసాద్, కుంచే నాని పాల్గొన్నారు.

పేకాట యానాంగా మార్చేశారు



పేకాట క్లబ్‌లకు వ్యతిరేకంగా చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

యానాం: పర్యాటక కేంద్రమైన యానాం పట్టణాన్ని పేకాట క్లబ్‌లు పెట్టి పేకాట యానాంగా మార్చేశారంటూ పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్ వెనక ఉన్న సూర్య రిక్రియేషన్ పేకాట క్లబ్‌ను మూసివేయాలంటూ వందలాది మందితో కలిసి ఆయన ప్రజా ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్ల పాటు నియోజకవర్గానికి నిస్వార్థ సేవలు అందించిన తనకు ప్రస్తుతం యానాంలో పరిస్థితులు ఆవేదనను కలిగిస్తున్నాయన్నారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులే గంజాయి, పేకాట వంటి వాటికి ప్రోత్సాహం అందించడం దురదృష్టకరమన్నారు. పేకాట క్లబ్‌లు, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌పై తీవ్ర విమర్శలు చేశారు. యానాంలో పేకాట క్లబ్‌లను మూసేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిడ్ల చంద్రరావు, వైస్ చైర్మన్ పెండెం సూర్య ప్రకాష్, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, వివిధ గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉపాధ్యాయుల ఆటల పోటీలు



ఆటల పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా ఆదివారం అమలాపురం బాలయోగి స్టేడియంలో నిర్వహించిన ఆటల పోటీల్లో ఉపాధ్యాయులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. కోనసీమ యూటీఎఫ్ టీచర్స్ ఒలింపిక్స్‌ను ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అమలాపురం డివిజన్ డీవైఈవో జి.సూర్య ప్రకాశం మాట్లాడుతూ ఉపాధ్యాయుల మానసిక ఉల్లాసానికి ఈ ఆటల పోటీలు దోహదపడతాయన్నారు. పురుషులకు వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్ క్రీడలు, మహిళలకు త్రోబాల్, బ్యాడ్మింటన్, చెస్, టెన్నికాయిట్, క్యారమ్స్, టగ్ ఆఫ్ వార్, రన్నింగ్, స్పీడ్ వాకింగ్, షార్ట్ పుట్ నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బీబీఎస్ మూర్తి, ఉపాధ్యక్షుడు కె.గణేష్, నేషనల్ ఎంపైర్ పాయసం శ్రీనివాస్, స్టేడియం ఇన్‌చార్జి భీమేష్, పీడీ మధుసూదన్, యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడు సురేంద్ర, జిల్లా కార్యదర్శులు కేశవరావు, మురుగేశ్వరరావు, రాయుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు



నిరసన తెలియజేస్తున్న ఐ.పోలవరం మండల మాలమహానాడు నాయకులు

ఐ.పోలవరం: కూటమి ప్రభుత్వంలో దళితులపై దాడులు ఎక్కువైపోయాయని, దళిత జాతిని అవమానిస్తున్న ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలని మండల మాలమహానాడు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఐ.పోలవరం మండలం అంబేడ్కర్ విగ్రహ ఆవరణలో పలువురు మాట్లాడుతూ ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని విచక్షణారహితంగా లాగి పడేశారన్నారు. అలాగే కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆర్ఎంసీ వైద్యుడు డాక్టర్ ఉమామహేశ్వరరావును బూతులు తిట్టడమే కాకుండా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళిత ఓట్లతో గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం దళితులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. సమావేశంలో వడ్డి గౌతమ్, విప్లవకుమార్, వాసు, యలమంచిలి సురేష్, మట్ట గగనవీరుడు, మోర్త చిన్న, నక్కా రామకృష్ణ, మచ్చా నాగబాబు, ఉంద్రు శివరాజు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుమారుడి చికిత్స కోసం ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న 2009-10 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

రాజోలు: లుకేమియా వ్యాధితో చికిత్స పొందుతున్న స్నేహితుడి కుమారుడికి చిన్ననాటి మిత్రులు అండగా నిలిచారు. కడలి గ్రామానికి చెందిన నాలుగో తరగతి విద్యార్థి వడ్డి ఆయుష్‌కుమార్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స నిమిత్తం రూ.9 లక్షల నుంచి రూ.10 లక్షల వరకూ ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. ఆయుష్‌కుమార్ తండ్రి మలికిపురం మండలం కేశనపల్లి ఉన్నత పాఠశాలలో 2009–10 సంవత్సరంలో పదో తరగతి వరకూ చదువుకున్నారు. దీంతో చిన్ననాటి మిత్రులంతా తలో చేయి వేసి స్నేహితుడి కుమారుడి వైద్యం కోసం రూ.35 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.

శ్రీకృష్ణుడు సూచించిన ధర్మ మార్గంలోనే నడవాలి



శ్రీకృష్ణుని తత్వం బోధిస్తున్న సుందర శ్రీనివాస్‌దాస్

అయినవిల్లి: ప్రతిఒక్కరూ శ్రీకృష్ణుడు సూచించిన ధర్మ మార్గంలో నడవాలని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్‌లో శ్రీకృష్ణుడికి ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆయన భక్తులకు శ్రీకృష్ణుని తత్వం బోధించారు. శ్రీకృష్ణుని లీలామృతాన్ని పారాయణం చేశారు. బొక్కా రవితేజ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు.

27న పి.గన్నవరంలో మెగా జాబ్ మేళా



పి.గన్నవరంలో మెగా జాబ్ మేళా పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27వ తేదీ ఉదయం పి.గన్నవరంలోని గ్రేస్ విద్యాసంస్థల ఆవరణలో నియోజకవర్గ స్థాయిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ జాబ్ మేళాకు 18 కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని వివరించారు.పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, బీటెక్ చదివిన నిరుద్యోగ యువతకు భారీ స్థాయిలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఎమ్మెల్యే సత్యనారాయణ ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల వెంకట సత్యనారాయణ, యర్రంశెట్టి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

అమలాపురం రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ బీసీ కులగణన అంశంపై స్థానిక ఈదరపల్లి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం రాత్రి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీలో దళిత అధ్యాపకుడు ఉమామహేశ్వరరావుపై ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేయడం, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని చించేయడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కొల్లాబత్తుల సత్యం, యాళ్ల దొరబాబు, కాశీ లక్ష్మీభవాని, చొల్లంగి వేణుగోపాల్, కాండ్రేగుల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

తాళ్లరేవు: గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపు సందర్భంగా గాడిమొగ లక్ష్మీగణపతి ఆలయం వద్ద ఆదివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, యూత్ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ముగింపు వేడుకలు

అమలాపురం రూరల్: ఓజోన్ దినోత్సవ ముగింపు వేడుకలను మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాలలో, మండపేట మండలం వెలగతోడులో సోమవారం నిర్వహించనున్నట్లు జిల్లా సైన్స్ అధికారి జీవీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలియజేశారు. ఈ సందర్భంగా ఓజోన్ పరిరక్షణ మన అందరి బాధ్యత అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లాలోని రెండు కేంద్రాల్లో ఎక్కడైనా హాజరు కావొచ్చన్నారు. మరిన్ని వివరాలకు 96401 88525 నంబరులో సంప్రదించాలని కోరారు.

క్రీడా పోటీలకు 260 మంది ఎంపిక

తాళ్లరేవు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన 260 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మండలంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీల్లో కబడ్డీ నుంచి 48 మంది, ఖోఖో 48, వాలీబాల్ 48, షటిల్ బ్యాడ్మింటన్ 8, చెస్ 8, యోగా 20, అథ్లెటిక్స్ పోటీలకు 80 మంది మొత్తంగా 260 మంది ఎంపికైనట్లు పోటీల మండల కోఆర్డినేటర్ వీకేఆర్ తండి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంపీపీ రాయుడు సునీత, ఎంఈఓలు మోకా ఉమ, ఎ.మంగాయమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

కేంద్రం విద్యుత్‌ను ప్రైవేటీకరిస్తోంది

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నాలుగు రీజియన్లలోనూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం దశల వారీగా ముందుకు వెళుతుందని పుదుచ్చేరి కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యుడు వి.వైథిలింగం పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో సీఎం రంగసామి, స్పీకర్ ఆర్.సెల్వం తదితర బీజేపీ, ఎన్ఆర్ కాంగ్రెస్ కూటమి నాయకులు పుదుచ్చేరి అసెంబ్లీలో మాట్లాడుతూ విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ జరగనియ్యమన్నారన్నారు. కాని దానికి విరుద్ధంగా కేంద్రం ప్రవర్తిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ సీఎం నారాయణసామి, మాజీ మంత్రి కందసామి పాల్గొన్నారు.

వైభవంగా మరిడమ్మ అమ్మవారి తీర్థం



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న మరిడమ్మ అమ్మవారు

తాళ్లరేవు: సీతారామపురం గ్రామ దేవత మరిడమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి అమ్మవారి జాతరను గరగన్నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో ఘనంగా జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తీర్థం సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ టి.లక్ష్మణరావు, పెమ్మడి కాశీవిశ్వనాథ్, ఆర్డేటి బాబూరావు, సంగాని ప్రసాద్, మందా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.